**కథ**

# ఇంట్లో విగ్రహాలు

**ఫోన్ మోగుతుంటే బద్ధకంగా, వెచ్చదనం ఇచ్చిన రొజాయిని పక్కకి నెట్టి, లేచి ఫోన్ తీసుకున్నాను.**

**"హలో!" అంటూ గోడ గడియారం కేసి చూసాను. మూడుంపావు. గోరువెచ్చటి ఎండ కిటికీలోంచి ఏటవాలుగా గోడ మీద పడుతోంది.**

**"సౌదామినిగారేనా!"**

**"అవును."**

''నమస్కారమండి. నాపేరు సరళాదేవి. జాగృతి మహిళామండలి ప్రెసిడెంట్‌ని.''

''నమస్కారమండి. మీరు, మీ ప్రోగ్రాంలు, మీరు నిర్వహించే కార్యక్రమాలు, గోష్టులు చూసాను. విన్నాను. మీరు చాలా సేవ చేస్తున్నారు. చాలా సంతోషంగా వుంది.''

''ఏదో నాకు చాతనైంత... పదిహేనేళ్లక్రితం మావారు పోయాక సమాజసేవ చెయ్యాలని నిశ్చయించుకున్నాను. ఆ దారినే ప్రయాణిస్తున్నాను. ఈ సంస్థే నా ఇల్లు. నా దైవం. నా ఒంటరి బ్రతుకుకి తోడూ నీడా... అవన్నీ వదిలేయండి. మీతో చిన్న పనుంది.''

నవ్వాను. ''నాతోనా!''

''ఆఁ... ఏం లేదు. మా జాగృతి పెట్టింది హైదరాబాద్‌లోనే అయినా, ఈసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవాడలో జరపడానికి నిశ్చయించుకున్నాము. ఆ సందర్భంగా, ఓ పదిమంది రచయిత్రుల్ని, కవయిత్రుల్ని పిలిచి సన్మానం చేద్దామని అనుకున్నాము. అందులో మీరు ఒకరు.''

''నాకు సభలు, సమావేశాలు ఇలాటివాటికి వచ్చే అలవాటు లేదండి. నన్నొదిలేయండి.''

''అహఁ... మీరు రావాల్సిందే. కాదనకండి.''

నసిగాను.

''కాదనకండి. ప్లీజ్.''

''అలాగే... వస్తాను.''

''మరో విషయం. సౌదామినిగారూ, మీరు 'మహిళలు-అధికారాలు' అన్న విషయం గురించి మాట్లాడాలి. ఆ తర్వాత ఆ రోజున జరిగే కార్యక్రమాల గురించి మా కార్యకర్తల్లో ఒకరు మీకు అన్నీ వివరంగా చెప్తారు. అయినా మీకు వాణిగారు తెలుసా! సంగీత విద్వాంసురాలు కళ్యాణిగారి కూతురు.''

''కళ్యాణిగారి గురించి విన్నాను. స్త్రీ జాతికే గౌరవం. ఈమధ్యనే ప్రతిభా పురస్కారం, పద్మభూషణ్ కూడా అందుకున్నారు. మన తెలుగువారికి గర్వంగా వుంది. అలాటి కళ్యాణిగారి కూతురు వాణి మీ సమాజంలో మెంబరా?''

''అవును. విజయవాడలోని కార్యక్రమాలు ఆవిడే చూస్తారు. ఇంకా చాలామంది వస్తారండి. ప్రోగ్రాం సక్సెస్ అవాలంటే మీ అందరి సహకారం వుండాలి.''

''స్త్రీలంతా ఏకం అయితే గర్వగాథలే వుంటాయి. కార్ల్‌మార్క్స్ ఏమన్నాడు, ప్రపంచ కార్మికులారా ఏకం కండి, మీరు పోగొట్టుకున్నదేం లేదు సంకెళ్లు తప్ప. కానీ నేనంటున్నాను, ప్రపంచ మహిళల్లారా ఏకం కండి, పోయేదేం లేదు మీ బానిసత్వం తప్ప'' ఆవేశంగా అన్నాను.

''చాలాబావుంది. సౌదామినిగారూ... ఇలాగే ఆవేశపూరితమైన స్పీచ్ ఇవ్వండి. వచ్చినవాళ్లంతా మంత్రముగ్ధులైపోవాలి. ఉంటానండి. మా ఆహ్వానాన్ని మన్నించినందుకు చాలా థాంక్స్.''

నేను మళ్లీ రొజాయిని లాక్కుని ఓ పక్కకి ఒత్తిగిలి కళ్లు మూసుకున్నాను. మళ్లీ ఫోన్ మోగింది.

''హలో'' అన్నాను.

''ఆఁ! ఏం సోదెప్పా! అంతా కులాసానా?'' మా పెద్దమామగారి గొంతు.

నన్ను సోదెమ్మ, సోదెప్ప అని పిలిచేది మా అత్తగారి వైపువాళ్లు. నాపేరు సౌదామినిగా స్కూలు రికార్డుల్లో వున్నా, ఇంక మా అత్తింటివారికి ఆ పేరే అలవాటు.

మా తాతగారు యజ్ఞం చేసిన తర్వాత నేను పుట్టాను. తాతగారు సోమయాజి అయితే, నానమ్మ సోదెమ్మ అయింది. నాకు నానమ్మ పేరు పెట్టినా సోదెమ్మ, సోదెప్ప అని అంటం మొదలెట్టారు. పెద్దనాన్నగారికి పుట్టిన అబ్బాయికి సోమయాజులు అని పెట్టారు. మా ఇంట్లోవాళ్లు సౌదామిని అనే అంటారు.

''శంకరం లేడా!''

''లేరు. జగ్గయ్యపేట వెళ్లారు.''

''ఉప్పుడొస్తాడా?''

''రారు. రేపు వస్తారు.''

''సరేలే. వాడి నంబరియ్యి...''

ఇచ్చాను.

''మనవరాలు బావుందా? కాలేజీకెళ్తోందా? ఏవిటో మొగపిల్లాడయితే వేరు. దీన్ని ఇంజనీరింగ్ కాలేజీలో ఎందుకు చేర్పించారు? నన్నడిగితే...''

''అమ్మాయి అయితే మటుకు ఇంజనీరింగ్ చదివించకూడదా?'' ఉక్రోషంగా అన్నాను.

''అది నీ ఇంట్లో ఓ చుట్టం మాత్రమేగా. సరేలే, నా సలహా ఎవరిక్కావాలి. కానీ, వుంటాను. ఆరోగ్యం అదీ చూసుకోండి. మరి వుంటా!''

ఇంట్లో దివ్య లేదు. ఉంటేనా పెద్ద తాతగారితో దెబ్బలాడేది. నేనే కొడుకుని, నేనే కూతుర్ని, మా నాన్నగారి ఉత్తరాధికారిని నేనే అంటూ గొడవ పెట్టేది.

కానీ దానికేం తెలుసు? మనదేశంలో ఆడవాళ్లు విగ్రహాలు మాత్రమే. పూజ చెయ్యడానికి మాత్రమే పనికొస్తారు. ప్రేమించడానిక్కాదు. అరచెయ్యి పైకెత్తి ఆశీర్వదించే ముద్రలో ఉంటే, ఏమన్నా చలించని బొమ్మలా ఉంటే దండం పెడతారు. ఆడజన్మకి మరో అర్థం లేదా!

ఎన్నేళ్లయినా, ఏ యుగం అయినా ఆడవాళ్లని చూసే కోణంలో ఏమాత్రం మార్పులేదు.

చిన్నగా నిట్టూర్చి పుస్తకాల బీరువా దగ్గరకెళ్లాను. రోమియో థోపర్ 'ప్రాచీన భారత సమాజంలో మహిళలు' తీశాను. వరసగా నాలుగురోజులు పుస్తకాలు చూడడంలో ఉండిపోయాను.

తలుపు కొట్టిన శబ్దం. అంటే శంకరం అన్నమాట. రేపుకదా రావాల్సింది! ఎవరైనా కాలింగ్‌బెల్ నొక్కుతారు. శంకరం మటుకు తలుపు కొడతాడు.

ఉత్సాహంగా తలుపు తీశాను.

''ఉన్నావా! ఎక్కడికైనా వెళ్లి వుంటావేమోనని ఫోన్ చెయ్యలేదు'' అంటూ లోపలికొచ్చాడు శంకరం. చేతిలో వున్న బ్రీఫ్‌కేసుని టీపాయ్ మీద పెట్టి ''రండి లోపలికి'' అంటూ రెండడుగులు ముందుకేశాడు.

తల పక్కకి వంచి గుమ్మంకేసి చూశాను.

మా పెద్ద మావగారు, ఆయన కొడుకు గోపాలం, గోపాలం కూతురు మాణిక్యం.

''రండి'' అంటూ ఆహ్వానించాను.

వీళ్లంతా రేపుంటారా, వెళ్లిపోతారా, నాకు వెళ్లడానికి అవుతుందా లేదా అని మనసులో సందేహాలు మొలుస్తున్నాయి. పైకి చిరునవ్వుతో వాళ్లని చూశాను.

''కూచోండి. కాఫీయా, టీనా, లేకపోతే నిమ్మరసం.''

''ఈ టైములో కాఫీ టీలు ఏవిటి? నిమ్మరసం తీసుకురా! ఏదీ మనవరాలు కనపడదేం?'' ఠక్కున అన్నారు పెద్ద మామగారు.

''కాలేజీలో ఏదో డిబేట్ వుందిట. అందుకోసం ఈ పక్కనే వున్న స్నేహితురాలింటికెళ్లింది ప్రిపేర్ అవడానికి.''

''ఏవిటో, అలా చీకటి పడ్డాకా అటూ ఇటూ వెళ్లడం అంత మంచిది కాదు. మీ ఇష్టం. ఏదో మా మటుకు తోచింది నేను చెప్పాను.''

లోపలికెళ్లాను నిమ్మరసం చెయ్యడానికి.

నా వెనకాలే వచ్చాడు శంకరం.

''రేపు మాణిక్యాన్ని చూసుకోడానికి పెళ్లివారొస్తున్నారు...''

''రేపా! రేపెలా కుదుర్తుంది?'' గబుక్కున అన్నాను.

''కుదరడానికి నీ ఇష్టం ఏమిటి? రేపు మంచి రోజు. మధ్యాహ్నం వస్తున్నారు. గోపాలం పిల్లని తీసుకొచ్చాడు. మనిల్లు మొగపెళ్లి వారింటికి దగ్గర కాబట్టి మనింట్లో పెళ్లిచూపులకి ఏర్పాటు చెయ్యమన్నారు. సరే అన్నాను. నీకేవిటీ ప్రాబ్లెం?''

ఆ తీవ్రతకి భయపడ్డాను.

''అబ్బే, నాకేవిటీ ప్రాబ్లెం! ఏంలేదే!'' రేపు నేను ఎక్కడికో వెళ్లాలని చెప్పడానికి భయపడ్డాను.

''నీకు తెలుసుగా, పెదనాన్నగారు డయాబెటిక్. ఎనిమిది గంటలకల్లా ఆయనకి భోజనం తయారు చెయ్యి. రెండు పుల్కాలు కూడా. పెరుగుందా, బయటికెళ్లి తేవాలా?''

''తీసుకురండి. ఉన్నది అందరికీ సరిపోదు.''

''రేపు టిఫిన్ అదీ చేస్తావా? బయటి నుంచి కొంటే మంచిదా?''

''పెద్దాయన్ని అడగండి.''

క్షణంలో వెళ్లి వంటింట్లోకి మళ్లీ వచ్చారు.

''ఓ స్వీటు నిన్ను చెయ్యమన్నాను. మరో స్వీటు, సమోసాలు, మిక్చరు తెప్పిద్దామన్నారు.''

''సోదెప్పా! అరటిపళ్లు, తమలపాకులు, వక్కలు తెప్పించు. ముగ్గురు ఆడవాళ్లు వస్తారు'' ముందు గదిలోంచి అన్నారు.

''అలాగే...''

''నేను రేపు 'ఆడవాళ్లు-అధికారాలు' గురించి మహిళా దినోత్సవ సందర్భంగా మాట్లాడాలి. నేను ఐదుగంటలకల్లా నన్నయ కళారంగం దగ్గరుండాలి'' అని అనలేకపోతున్నాను.

ఏవయినా అంటే, నావాళ్లంటే ఇష్టం లేదు అని గొడవ చేస్తే, వచ్చినవాళ్ల ముందు పరువేంకాను?

ఈ లోపల దివ్య వచ్చింది.

''ఏంటమ్మా ఇది? నాన్నగారు ఆ అమ్మాయిని బ్యూటీ క్లినిక్కి తీసుకెళ్లమంటున్నారు? రేపు కాలేజీ వుందికదా! పైగా డిబేట్ 'బిగ్ ఫైట్'లాగా వుంటుంది. మంచి పదాలు, మంచి వాక్యాలు కావాలి. ఆ ప్రిపరేషన్ కోసం నేను రేపు తప్పకుండా వెళ్లాలి. పార్లర్కి నేనెల్లా తీసుకెళ్తాను. ఏవైనా అంటే తిడతారు. నువ్వు చెప్పమ్మా!''

'ఊరుకో, నేను వున్నాగా!' అన్నట్లు కళ్లతో చేతుల్తో సైగలు చేశాను.

''ఆ! వొదినా! ఏం వండుతున్నావ్? దివ్యా! మీ అమ్మకి సాయం ఏవిటీ నువ్వు! వొంటొచ్చా?'' అంటూ గోపాలం వచ్చాడు లోపలికి.


''పెద్దగా రాదు.''

''మా మాణిక్యం అద్భుతంగా వంట చేస్తుంది'' పెదిమలు విరిచి కళ్లు ఎగరేస్తూ గర్వంగా అన్నాడు.

ఎవరి పిల్లలు వాళ్లకి గర్వం.

దివ్య వెళ్లిపోయింది.

''వొదినా! అన్నయ్య చెయ్యాల్సింది వాడు చేశాడు. నీ వంతు స్వీటు అది చేస్తావు ఎలాగూ. ఆ పని నీకుంది. కాకపోతే మరోటి నువ్వు చెయ్యాలి'' చూపుడు వేలు ఊపుతూ.



''ఏవిటో?''

''అబ్బాయేమో హైదరాబాద్లో వుంటున్నాడు. మా పిల్ల ఎలాగైనా ఒక్కరవ్వ పల్లెటూరి వాటంగా అనిపిస్తుంది. నువ్వు గనక దివ్యని ఈ ఛాయలకి రాకుండా చేస్తే...''

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

''అర్థం అయింది. మీరు నిశ్చింతగా వుండమ్మా. అది పొద్దున్నే కాలేజీకి వెళ్లిపోతుంది.''

''మరి బ్యూటీ పార్లరూ...''

''నే తీసుకెళ్తాగా...''

అందరి భోజనాలు అయ్యి నేను పక్కమీద వాలే సరికి పదకొండు అయింది. శంకరం వచ్చినవాళ్లకి పక్కలు వేసి వచ్చాడు.

''రేపు మహిళా దినోత్సవం'' అన్నాను మెల్లిగా.

''ఏవంటావయితే?''

**గంటి భానుమతి**

''నన్నయ కళారంగంలో ఫంక్షన్ వుంది.''

''ఎన్ని గంటలకి?''

''ఐదు గంటలకి.''

''నాలుగున్నరకి పెళ్లిచూపులు కదా!'' ఆశ్చర్యంగా అన్నాడు.

''అదే అంటున్నాను'' నసిగాను.

''అంటే నువ్వుండవా! దానర్థం అలాగే వుంది.''

''గోపాలం పెళ్లాం రావడానికి వీలవక రాలేదు. నామీద కొండంత నమ్మకంతో మరో ఆలోచన లేకుండా, రాజమండ్రి నుంచి వచ్చారు. ఇల్లు వాళ్ల మీద వదిలేసి అలా వెళ్తానంటావా?''

నోట మాట రాలేదు.

''నీకు మా పెద్దనాన్నగారు చేసిన త్యాగం గురించి

## దియా ఇష్టాలు

**'లోకోభిన్నరుచి...' అన్నట్టుగా తారలకి కొన్ని ఇష్టాయిష్టాలుంటాయి. విదేశాల్లో షూటింగ్‌లంటే తనకెంతో ఇష్టం అంటోంది దియామీర్జా. ఇప్పుడు మామూలు సినిమాలు కూడా విదేశాల్లో ఎక్కువ రోజులు షూటింగ్ జరుపుకుంటున్నాయి. అలాంటిది అందాల తారలు నటించే చిత్రాల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. దియామీర్జా, డినోమోరియా, శీతల్ మల్లార్, ఆశిష్ చౌదరి నటిస్తున్న కొత్త చిత్రం 'కభీ ఖీ కహీ ఖీ' స్విట్జర్లాండ్, స్కాట్లాండ్‌లలో షూటింగ్ పూర్తిచేసుకుంది. దియామీర్జా మాత్రం ఈ చిత్రంలో తాను డిఫరెంట్‌గా కన్పిస్తానంటోంది.**

తెలీదు. ఆయన మా నాన్నగార్ని కాకినాడలో వుంచి చదివించారు. ఆయన మటుకు అలాగే వైదీకం కంటిన్యూ చేశారు. ఓసారి నాన్నగారి ఫీజుకి డబ్బు లేకపోతే మా పెద్దమ్మ కాళ్ల కడియాలు, గొలుసులు అమ్మేశారు. నాన్నగారు ఇంగ్లీషు చదువులు చదవాలన్న ఆశ, కోరికా అలాంటిది. మా నాన్నగారు ఎప్పుడూ అంటూంటారు, అన్నయ్య ఋణం ఎప్పటికీ తీర్చుకోలేమూ అని. అలాటిది, ఈ రోజున అంత పెద్దాయన ఇంటికొచ్చినప్పుడు...''

''మీకెప్పుడు తెలుసు రేపు పెళ్లిచూపులన్న సంగతి?''

''వారం క్రితం...''

''మరి నాకెందుకు చెప్పలేదు? తెలిస్తే వాళ్లకి నేను మాట ఇచ్చేదాన్ని కాదుకదా! నా ఇంట్లో జరిగే కార్యం నాకు తెలీకూడదు. కానీ నేను మటుకు దగ్గరుండి ఏ లోటూ రాకుండా జరిపించాలి. భలేవారండి.''

''ఏదో మర్చిపోయాను. దానికి రాద్ధాంతం చేస్తావేం?''

''రాద్ధాంతం కాదు, నిజం. కనకదుర్గ గుడి చూడ్డానికి మా అమ్మానాన్నా నెలరోజుల ముందు నుంచి ప్లాను వేసుకున్న సంగతి మీకు తెలుసు. అయినా పనుందని వెళ్లిపోలేదూ! అమ్మానాన్నలే కాదు, నా వాళ్లెవరొచ్చినా మీ బిహేవియర్ మారిపోతుంది.''

''దానికీ దీనికీ సంబంధం ఏవిటీ?'' గట్టిగా అన్నాడు.

తనతో ఏదో వాదించాలని, ఒప్పించాలన్న ఆవేశం వచ్చింది. కానీ సనాతన దారిలో పోయే శంకరాన్ని ఒప్పించే శక్తి నాకు లేదు. నేను పంతానికి పోతే శంకరం దిగజారిప్పు. ఇంటికొచ్చినవాళ్లు ఏమనుకుంటారు? పరాయి వాళ్లముందు పిల్లల్ని ఓ మాట అనడానికి నేను జంకుతాను కానీ, నన్ను పరాయివాళ్ల ముందు అనడానికి ఏమాత్రం వెనకాడడు.

''వ్యక్తిత్వాలూ, అభ్యుదయాలు, అధికారాలు ఉపన్యాసాల్లో నిండానికి బావుంటాయి. రేపు నువ్వుండాల్సిందే...''

''సొంత తల్లి తన పని మానుకుని రాలేదే? నేను వాళ్లకిచ్చిన మాట తప్పి వెళ్లకపోవడం...''

''స్టాప్. రేపు నువ్వు ఇంట్లోనే వుంటావు. అంతే. ఇంక నోర్మూసుకో.''

కళ్లల్లో నీళ్లు. లైటార్పి కళ్లు మూసుకున్నాను. నా ఇంట్లో నాకే అధికారం లేదు.

ఎన్ని ఆశయాలున్నా, ఎన్ని ఆశలున్నా, ఎంత అభిమానం వున్నా, సమాజంలో నేను ఎంత గౌరవింపబడుతున్నా నా భర్తకి మటుకు గడ్డిపరకని. దూదిపింజ కన్నా తేలిక.

ఈ విషయంలో నేను ఏమాత్రం ముందుకెళ్లినా, తన అహాన్ని తృప్తి పర్చుకోవడం కోసం విడాకులు ఇవ్వడానికి కూడా వెనకాడడు... ఎమోషనల్ దెబ్బ. స్త్రీకి అధికారం వుందా! దేనికి? ఏం అనే అన్నదానికి అధికారం! ఎందుకు? అని ప్రశ్నించే అధికారం వుందా!

మర్నాడు యదాప్రకారంగా పనులు చేసుకుంటున్నాను. పొద్దున్న పదకొండు గంటల ప్రాంతంలో ఫోన్ వచ్చింది.

''సౌదామినీ! నీకే ఫోన్'' అన్నాడు శంకరం వంటింట్లోకి వస్తూ.

అప్పుడే మొదలుపెట్టాను కాబట్టి పొయ్యి ఆపాను.



''సౌదామినిగారేనా! సాయంత్రం నాలుగున్నరకల్లా రెడీగా వుండండి. కారు వస్తుంది. మా కార్యకర్తలిద్దరిని పంపిస్తున్నాను మిమ్మల్ని తీసుకురావడానికి.''

ఒక్క క్షణం కళ్లు మూసుకుని పెదిమలు బిగపట్టాను.

''మన్నించండి సరళాదేవి, సాయంత్రం నేను రాలేకపోతున్నాను.''

''అరెరే! ఏమైంది? మీలాటి రచయిత్రి కూడా మాట్లాడితే బావుంటుంది.''

'నేను వస్తే నా సంసారంలో ఉవ్వెత్తున తరంగాలు లేచి నన్ను, నా జీవితాన్ని ముంచేస్తాయి' మనసులో అనుకున్నాను.

''అవుననుకోండి. కానీ, అనుకోకుండా అతిథులొచ్చారు.''

''వాళ్లని కూడా తీసుకురండి. కానీ, మీరు ఎలాగైనా రావాల్సిందే.''

''నన్ను మన్నించండి, రాలేనండి'' నిస్సహాయంగా రాలుతున్న కన్నీళ్లు.

''పర్వాలేదులెండి. మీ ఉపన్యాసం వినాలన్న మా ఆశ తీరలేదు మరోసారి.''